


# చంద్రోదయం

సరయు డ్రైవ్ చేస్తున్న సాంత్రో కారు ఆ ఇంటి ఆవరణలోకి ప్రవేశించేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది.

రోజూ తను వచ్చిన అరగంట తరువాత ఇంటికి చేరే సౌమిత్రి ఇండికా కారు అప్పటికే గేరేజ్‌లో వుండడం చూసి ఆశ్చర్యపోయింది సరయు.

కారు పార్క్ చేసి తన దగ్గరున్న తాళం చెవితో తలుపు తెరుచుకుని లోపలకు వచ్చింది.

వెనుక వైపు బాల్కనీలో చీకటిలో కూర్చుని వున్న సౌమిత్రిని చూసి "అదేమిటి లైట్ కూడా వేసుకోకుండా కూర్చున్నావు? ఎంతసేపయింది వచ్చి?" అనడుగుతూ బాల్కనీలో లైట్ వేసి అతని ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

చేతిలో వెలుగుతున్న సిగరెట్‌ని క్రింద పడేసి కాళ్ళకున్న హవాయి చెప్పుతో నలిపేసి కుర్చీలో నుండి లేచాడు సౌమిత్రి. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. జుట్టు రేగిపోయి వుంది. అతన్ని ఆ రూపంలో చూసేసరికి సరయుకు ఆందోళన కలిగింది.

"ఏమైంది సామీ? తలనొప్పిగా వుందా? బాగా అలసిపోయినట్టు కనబడుతున్నావు. రాత్రి హాయిగా నిద్రపోయి లేస్తే పొద్దున్నకల్లా హుషారుగా వుంటావు. రేపు శనివారం, ఎల్లుండి ఆదివారం రెండ్రోజులు మనవే..పిల్లలు ఈ వీకెండ్‌కి ఎక్కడికి ప్రోగ్రామ్ వేసారో..రేపు వాళ్ళొస్తే తెలుస్తుంది. అరె మరిచేపోయాను. దార్లో పిజ్జాహట్‌లో పిజ్జా ప్యాక్ చేయించుకు వచ్చాను. పద పద శుక్రవారం రాత్రి స్పెషల్ ఐటమ్ తింటూ వీకెండ్‌కు స్వాగతం చెప్పడం మన ఆనవాయితీ కదా!" అంటూ అతన్ని ఉత్సాహపరిచింది.

పిట్టగోడమీద చేతులు ఆన్చి బయటకు చూస్తూ నిలబడిన సౌమిత్రి ఎప్పటిలా సరయు భుజాల మీద చేతులు వేసి, ఆమె మెడ వంపులో ముఖం ఆన్చి 'హమ్మయ్య నా పెళ్ళాం నాకే సొంతం' అనుకునే శుక్రవారం రాత్రికి స్వాగతం అనలేదు.

"పిల్లలకు సర్‌ప్రైజ్ ఇద్దామని వాటర్ వరల్డ్‌లో టిక్కెట్లు బుక్ చేసాను. పనిలో పని నిన్ను కూడా స్విమ్మింగ్ డ్రెస్‌లో చూడొచ్చు" అంటూ అల్లరి చేయలేదు. అలాగే మౌనంగా నిలబడ్డాడు.

సరయుకు భయం వేసింది. మనసు కీడును శంకించింది.

"ఏమైంది సామీ? మాట్లాడు ప్లీజ్" అన్నది దగ్గరగా వెళ్ళి వెనుక నుండి అతని చుట్టూ చేతులు చుట్టి.

"ఇప్పటి నుండి నాకు అన్ని రోజులు వీకెండ్‌లాటివే. ఇక ఆఫీస్‌కి వెళ్ళనక్కర్లేదు" నెమ్మదిగా అన్నాడు సౌమిత్రి.

ఆ రోజు ఉదయమే అతనికి పింక్ కార్డ్ ఇచ్చింది కంపెనీ. సాయంత్రం అతని క్యూబికల్‌లోని డెస్క్ ఖాళీ చేయమనీ...అతని నెల జీతం తీసుకుని వెళ్ళిపోవచ్చుననీ ఆదేశం అందింది.

"నాకు ఒక్కమాట ఫోను చేసి చెప్పవచ్చుకదా! ఒక్కడివీ దిగులు పడుతూ కూర్చోవడం దేనికి? అయినా ఇంత హఠాత్తుగా..ముందు చెప్పకుండా తీసేయడానికి నువ్వు అనుభవం లేని జూనియర్‌వి కాదు కదా...వేరే కంపెనీ నుండి ఇంకా మంచి పొజిషన్, శాలరీ అని ఇక్కడికి వచ్చావు. డోన్ట్ వర్రీ నీకు మరో జాబ్ వస్తుంది. పొద్దున్న నుండీ ఈ ఆదుర్దాలో ఏమీ తిని వుండవు. పద కాస్త తిని విశ్రాంతి తీసుకుని తరువాత ఆలోచిద్దువుగానీ" లాలనగా అంటూ అతని చేయి పట్టి లోపలికి లాక్కుని వెళ్ళి డైనింగ్ టేబులు ముందు కూర్చోబెట్టింది సరయు.

మర్నాడు ఉదయం అతనికన్నా ముందు లేచి తొందరగా తయారై పిల్లల్ని హాస్టల్ నుండి తీసుకురావడానికి వెళ్ళింది సరయు. ఎనిమిదేళ్ళ అనీష్, ఆరేళ్ళ అవంతి ఆ ఊళ్ళోని ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుతున్నారు. సంవత్సరానికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఫీజు కడుతున్నారు. నెలకి ఒక్కసారి వారాంతం సెలవులు తల్లిదండ్రులతో గడపడానికి అనుమతిస్తుంది స్కూల్ యాజమాన్యం. పిల్లల్ని తీసుకుని రావడానికి వెళ్ళిన సరయు వాళ్ళతో తిరిగి వచ్చేదాకా ఇంకా నిద్ర పోతూనే వున్నాడు సౌమిత్రి.

"నాన్నా ఇంకా నిద్ర పోతున్నారా? ఇవాళ మనం ఐస్‌వరల్డ్‌కి వెళ్తున్నామని చెప్పింది అమ్మ. లేవండి" అంటూ గోల చేసారు అనీష్, అవంతి తండ్రి మీదకు ఎక్కి కూర్చుని. చదివేది ఇంగ్లీష్ మీడియం స్కూలే అయినా 'అమ్మా నాన్నా' అన్న కమ్మని పిలుపు పిల్లలకు మొదటినుండీ అలవాటు చేసింది సరయు.

అయిష్టంగానే కళ్ళు తెరిచాడు సౌమిత్రి. పిల్లల్ని చూడగానే మనసు మీద వున్న బరువేదో తొలగినట్టు అనిపించి ఇద్దర్నీ చెరొక చేత్తో దగ్గరకు తీసుకున్నాడు.

"ఇక మీదట మిమ్మల్ని ఎక్కడికైనా తీసుకు వెళ్ళాలన్నా, నాకు తిండి పెట్టాలన్నా మీ అమ్మ దయతలచితేనే.." ఇద్దరి బుగ్గల మీదా చెరొక ముద్దూ ఇచ్చి మంచం దిగాడు సౌమిత్రి.

వంటింట్లో ఫలహారం తయారుచేస్తున్న సరయు తలతిప్పి అతని ముఖంలోకి చూసింది. ఆమెతో చూపులు కలపకుండా నీళ్ళగదిలోకి వెళ్ళాడతను.

ఆదివారం సాయంత్రం పిల్లలిద్దర్నీ హాస్టల్లో వదిలేసి ఇంటికి చేరాక స్నానం చేసి అతనికిష్టమైన నిమ్మపండు రంగు నైటీ వేసుకుని 'పారడైజ్' సెంట్ స్ప్రే చేసుకుని సౌమిత్రి పక్కన చేరింది సరయు. వారమంతా ఊపిరి సలపని పనులు, పరుగులు వురుకుల జీవితంలో భార్యాభర్తలిద్దరూ ఒకరి సన్నిధిలో మరొకరు పరవశించగలిగేది వారాంతపు సెలవురోజున మాత్రమే. రాత్రి పదిగంటల వరకు పనిచేసి అలసిపోయిన వారి శరీరాలు విశ్రాంతి కోరతుంటే మనసులో కోరిక కూడా స్తబ్దంగా నిదురపోతుంది వర్కింగ్ డేస్‌లో.

"యు ఆర్ మై పారడైజ్" అంటూ సరయును అల్లుకుపోలేదు సౌమిత్రి. పక్కన పడుకున్న భార్య తన మీద చేయి వేసినా కదలిక లేకుండా అలా కళ్ళు మూసుకుని వుండిపోయాడు.

పదిరోజులు గడిచాయి. సౌమిత్రికి సరయుకు మధ్యన మౌనం గోడ కడుతోంది. సౌమిత్రి ఇంట్లోనే వుంటున్నాడు గనుక కొన్ని పనులు అసంపూర్తిగా వదిలేసి "కాస్త రసం ఒక్కటీ పెట్టుకో సామీ" అనీ "పాలు తోడు పెట్టేయి మరచిపోకుండా" అనీ చెప్పి హడావుడిగా సరయు వెళ్ళిపోతుంటే తట్టుకోలేకపోయాడు సౌమిత్రి.

"ఎలాగూ ఉద్యోగం సద్యోగం లేకుండా నీ సంపాదన తిని బ్రతుకుతున్నాను. రేపటి నుండి వంట నేను చేస్తాలే" అన్నాడొకరోజు.

అతని మాటల్లోని వ్యంగ్యం, ఉక్రోషం సరయుకు అర్థమైనా వాతావరణాన్ని తేలిక పరచడానికి నవ్వు ముఖం పెట్టి "మీ పరిశోధనలు నా మీద ప్రయోగించొద్దు బాబూ! మళ్ళీ నేను మంచాన పడితే...?" అంది.

"అవును. ఇంటి బాధ్యత మోస్తున్నదానివి. సంపాదించి సాకుతున్నదానివి. నీకేమయినా అయితే మాకు అన్నం పెట్టే వాళ్ళెవరు? నాలాంటి పనికిరాని వాడు జబ్బుపడ్డా ఫరవాలేదుగానీ..అయామ్ సారీ!" అన్నాడు సౌమిత్రి కరకుగా.

సరయు మనసు చివుక్కుమంది. మాటకు మాట పెంచడం మంచిది కాదని వూరుకొంది.

రెండ్రోజుల తరువాత నెమ్మదిగా అంది సరయు "పోనీ పిల్లల్ని హాస్టల్ నుండి తీసుకు వచ్చి ఇంట్లోనే పెట్టుకుందామా? ఇంటి నుండి పంపిస్తే ఫీజు తగ్గుతుంది" అని.

"అవును. నేను ఎలాగూ రోజంతా పనీపాటా



లేకుండా తిని కూర్చుంటున్నాను. పిల్లల్ని రెడీ చేయడం, స్కూలుకు వదలడం, తీసుకు రావడం వంటి పనులైనా చేస్తే నాకు పెట్టే తిండి గిట్టుబాటవుతుంది. అంతేనా?" తీక్షణంగా అడిగాడు సౌమిత్రి.

అంతవరకు అతను వ్యంగ్యంగా మాట్లాడినా, సూటిపోటి మాటలన్నా సహనం వహించిన సరయు ఈ అభియోగాన్ని తట్టుకోలేకపోయింది.

"ఎందుకలా మాటలతో పొడుస్తావ్ సౌమీ? ఆ పోయేదేదో నా ఉద్యోగం పోయి వుంటే బాగుండేది" కాస్త పదునుగా అంది.

"అయ్యో మాలాంటి అల్లాటప్పాగాళ్ళని ఎంతమందిని తీసిపారేసినా కంపెనీలకు నష్టం వుండకపోవచ్చును గానీ నీలాంటి హైలీ ఎఫీషియంట్ ఉద్యోగులని తీసేస్తే కంపెనీలు మూతపడిపోతాయి మేడమ్" నవ్వుతూనే వ్యంగ్యంగా బాణాలు విసిరాడు అతను.

నెలన్నర గడిచింది. సౌమిత్రికి ఉద్యోగం దొరకలేదు. ఖర్చులు తలచుకుంటే నిద్ర పట్టడం లేదు సరయుకు. రెండో కారుకు లోను, ఇంటికి చేసిన లోను, పిల్లల పేరిట చేసిన ఇన్స్యూరెన్స్ ప్రీమియమ్‌లు తన ఒక్క సంపాదనతో ఎలా కట్టడం?

"నా కారు అమ్మేద్దాం సౌమీ..అంత దూరం వెళ్ళడానికి పెట్రోలు ఖర్చు కూడా చాలా అవుతుంది" అన్నది ఒకరోజు.

"ఉద్యోగం లేనివాడికి కారెందుకు అమ్మేయ్- అని నేరుగా చెప్పరాదూ?" చేతిలోని పేపరును విసిరికొడుతూ అరిచాడు సౌమిత్రి.

'అతనికి తమ పరిస్థితి అర్థం కావడం లేదా? ఎంతసేపూ తనకు ఉద్యోగం పోయిందన్న ఆత్మన్యూనతా భావంతో బాధపడుతూ తనమీద మాటల అస్త్రాలు విసురుతూ ఇంట్లో నరకం సృష్టిస్తున్నాడు. నీకు భగవంతుడిచ్చిన అదృష్టాన్ని తలచుకుని తృప్తిపడు అన్నమాట ఇతను మరచిపోయాడా? ఎలా ఇతనిని మార్చడం? ఇద్దరిలో కనీసం ఒకరికి ఉద్యోగం వుంది గనుక ఎలాగో నెట్టుకు రాగలుగుతున్నారు. భవిష్యత్తులో పరిస్థితి ఎలా వుంటుందో? ప్రస్తుతం వున్న ఆర్థిక మాంద్యం మూలంగా, ముఖ్యంగా అమెరికాలాంటి దేశాలలో రిసెషన్ వలన ఐ.టి. పరిశ్రమలు దెబ్బ తిని ఉద్యోగులను తొలగించడం ఇంకా జరుగుతూనే వుంది. సౌమీకి ఉద్యోగం...అంటే అతనికి తగిన ఉద్యోగం రావడానికి కొంత సమయం పట్టవచ్చును. ఇటువంటి పరిస్థితిలో వెనుక ఆస్తిపాస్తులు లేని తమకు ఏదో ఒకరికైనా సంపాదన వుండడం ఎంత అదృష్టమో అతనికి అర్థమయ్యేదెలాగ?' ఆ రాత్రి ఈ ఆలోచనలతో నిద్రకు దూరమయింది సరయు.

ఈ రెండు నెలలుగా ఇద్దరి మధ్యన సాన్నిహిత్యమే లేకుండా పోయింది. పక్క పక్కనే పడుకున్నా మౌనంగా ఎవరి ఆలోచనలలో వారు వుండిపోతున్నారు. ఈసారి పిల్లలను ఇంటికి తీసుకు వచ్చినప్పుడు గుడికి వెళ్ళే ప్రోగ్రామ్ పెట్టింది సరయు.


"మీ నాన్న మిమ్మల్ని ఐమాక్స్‌లకు తీసుకెళ్ళి సినిమాలు చూపించి, స్టార్ హోటళ్ళలో డిన్నర్ ఇప్పించే స్థోమత లేనివాడురా...మీ అమ్మ మీద ఆధారపడ్డాం మన ముగ్గురం" అంటూ పిల్లల ముందు కూడా బయటపడ్డాడు సౌమిత్రి.

'భగవంతుడా నువ్వే దారి చూపించాలి' మనసులో మౌనంగా ప్రార్థించింది సరయు.

ఆ నెలాఖరున శుక్రవారం రోజున సాయంత్రం అయిదు గంటలకే ఇంటికి వచ్చేసింది సరయు.

"అదేమిటి? రాత్రి పదింటికి గానీ ఇంటికి చేరలేని బిజీ వుమన్ ఇవాళ ఇంత తొందరగా రావడం ఎక్కడ తుపాను వచ్చిందో?" నీరసంగా నడుస్తూ లోపలికి వచ్చిన సరయును వుద్దేశించి అన్నాడు సౌమిత్రి.

"సాపిట్ సౌమీ! నౌ యు కెన్ రిలాక్స్. కాదు ఇద్దరం తీరికగా కూర్చోవచ్చు. నేను ఆలస్యంగా రానక్కర్లేదు. నువ్వు ఇంట్లో చిన్న చిన్న పనులు చేస్తున్నందుకు ఫీలైపోనక్కర్లేదు. ఆడదాని సంపాదన మీద ఆధారపడి బ్రతుకుతున్నానని ఆవేదన చెందనక్కర్లేదు. ఆర్ యు హ్యాపీ?" ఎరుపెక్కిన కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతుండగా వణుకుతున్న గొంతుతో అనేసి గదిలోకి వెళ్ళి పడుకుంది సరయు.



సౌమిత్రి ముఖం పాలిపోయింది. ఆమె చెప్పిన విషయం నమ్మలేనట్టు సరయు వెనుకనే పడక గదిలోకి వెళ్ళాడు.

"సరూ! ఏం జరిగింది? డోంట్ సే యు ఆర్ ఫైర్డ్.. ఓ

"గాడ్.." అంటూ క్రాఫ్‌లోకి వేళ్ళు జొప్పించి తల రుద్దుకుంటూ ఆమె పక్కన కూలబడ్డాడు.

సరయు పలుకలేదు. రాత్రి అతనే కంచంలో అన్నం కలిపి తీసుకువస్తే వద్దంటూ పడుకుంది.

శనివారం వచ్చింది. తొమ్మిదవుతున్నా నిద్రపోతూనే వుంది సరయు.

తనే వెళ్ళి ఆమెను లేపి కాఫీ అందించాడు.

"నువ్వు మరీ అంత దిగులు పడిపోకు సరూ..ఇన్నాళ్ళూ కనీసం ఒకరికైనా ఉద్యోగం వుందని కాస్త ధైర్యంగా వుండేది. ఇప్పుడదీ లేదు. నిండా మునిగిన వాళ్ళకు చలేమిటి? మన ప్రయత్నం మనం చేద్దాం. ఏదో ఒకటి మనిద్దరిలో ఎవరో ఒకరికి దొరక్కపోదు" సరయు భుజం చుట్టూ చేయి వేసి ధైర్యం చెప్పాడు. కాఫీ తాగేసి స్నానం చేసి, మళ్ళీ పడుకుంది సరయు.

సౌమిత్రి వంట చేసి సరయును లేపాడు. "వద్దు సామీ..ప్లీజ్ లీవ్ మీ ఎలోన్.." అంటూ కళ్ళు మూసుకుంది సరయు.

"నువ్వు అన్నం తింటే మనం స్కూలుకు వెళ్ళి పిల్లల్ని తీసుకురావొచ్చు. నువ్వన్నట్టు వాళ్ళనిక హాస్టల్‌లో పెట్టొద్దు. అసలు ఆ స్కూలు నుండి మన ఇంటి దగ్గరే వున్న మామూలు ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్‌లో చేర్పిద్దాము. అలా అయితే ఇద్దరికీ కలిపి నెలకి వెయ్యి రూపాయలకన్నా ఫీజు వుండదు. కొత్త కారు అమ్మకానికి పెడదాం. అంతగా అయితే ఈ ఇంటిని అద్దెకిచ్చేసి ఏదైనా అపార్ట్‌మెంటులోకి మారొచ్చు. ఇంటికి అద్దె కనీసం పాతిక వేలు వస్తుంది. అది ఇంటి లోన్‌కి సర్దుదాం" లాలనగా అన్నాడు సౌమిత్రి.

అతను తనతో ఆమాత్రం అనురాగంతో ప్రేమతో మాట్లాడి ఎన్ని రోజులయిందో తలచుకుంటే సరయు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అరె ఎందుకా కన్నీళ్ళు? నేనున్నాను కదా! నువ్వేమీ వర్రీ కావొద్దు. ఎలాగో కొన్నాళ్ళు గడవనీ..పరిస్థితులు చక్కబడకపోవు" అంటూ సరయును దగ్గరకు తీసుకుని అనునయించాడు. అతని గుండెల మీద తల వాల్చి సేద దీరుతున్నట్టుగా కాసేపు మౌనంగా వుండిపోయింది సరయు.

తరువాత తలెత్తి అతని కళ్ళలోకి చూస్తూ నెమ్మదిగా అంది "మిన్ను విరిగి మీద పడుతున్నా చలించను అన్నంత గంభీరంగా నువ్విలా మాట్లాడుతుంటే నాకెంత బాగుందో సామీ. నువ్వేనా ఇన్నాళ్ళూ నీ ఉద్యోగం పోయిందన్న బాధతో ఆత్మన్యూనతకు లోనై ఆ విసుగును, చిరాకునూ నా మీద చూపుతూ సూటిపోటి మాటలతో బాధించింది అని ఆశ్చర్యం కలుగుతోంది. భార్యకైనా ఉద్యోగం వుందని సంతోష పడదానికి బదులు అదేదో నీ అహాన్ని దెబ్బతీసినట్టు ప్రవర్తించావు. ఖర్చులు తగ్గించుకుందామని నేను సున్నితంగా సూచిస్తే నిన్ను అవమానించినట్టు భావించావు. ఎందుకు సామీ? మనిద్దరి మధ్యన ఇంత అగాథాన్ని ఎందుకు రానిచ్చావు? నిజంగా నాకు కూడా ఉద్యోగం పోవడం నిన్ను, నీ అహాన్ని తృప్తిపరచిందా?" సరయు కళ్ళలో తొంగి చూస్తున్న బాధ సౌమిత్రి హృదయాన్ని తాకింది. ఆత్మ విమర్శ చేసుకుంటున్నట్టు ఒక నిముషం మాట్లాడకుండా వుండిపోయాడు.

"నువ్వన్నది నిజమేనేమో సరూ! ఉద్యోగం పురుష లక్షణం అన్న భావన మా మగవాళ్ళలో పాతుకుపోయిందేమో. కుటుంబ భారాన్ని మోసే బాధ్యత మాది అన్న అభిప్రాయం నుండి బయటపడలేని బలహీనత నాలోనూ వున్నదనుకుంటాను. అందుకే బహుశా నువ్వన్నట్టు ఒకరికైనా ఉద్యోగం వుంది థాంక్ గాడ్ అనుకోకుండా అదేదో నా అభిమానాన్ని దెబ్బతీసినట్టు నీతో కటువుగా ప్రవర్తించాను. సారీ..కానీ నీకూ ఉద్యోగం ఊడిపోవాలని కోరుకునేంత దుర్మార్గుడిని కాదు సరూ..బిలీవ్ మీ..ఇంకోసారి మనిద్దరి మధ్యన ఇటువంటి అపోహలకు చోటు ఇవ్వను. సరేనా? ఇక కోపం చాలించి అన్నానికి రా ఆకలేస్తోంది" అంటూ సరయును డైనింగ్ టేబులు దగ్గరకు నడిపించాడు.

భోజనం ముగించి ఇద్దరూ ప్రశాంతంగా కూర్చున్నప్పుడు సౌమ్యమైన స్వరంతో అంది సరయు "నువ్వు మళ్ళీ ఇదివరకటిలా ఆవేశంగా స్పందించనని మాటిస్తే ఒక విషయం చెప్తాను"


"సారీ చెప్పాక ఇక మళ్ళీ మళ్ళీ నా తప్పు ఎత్తి చూపకూడదు. మాటిచ్చాను కదా ఇక మీదట మనిద్దరి నడుమ 'ఇగో క్లాషెస్' రానివ్వనని" మృదువుగా అన్నాడు సౌమిత్రి.

"నా ఉద్యోగం పోలేదు సామీ..నీ మనసులో రేగే సంఘర్షణతో నువ్వు రోజు రోజుకూ నాకు దూరమైపోతూ వాస్తవాన్ని విస్మరిస్తున్నావన్న భయంతో నాకూ జాబ్ పోతే మన పరిస్థితి ఏమిటో అన్న ఆలోచన నీలో కలిగితే, నీలో మార్పు వస్తుందన్న ఆశతో నేను అబద్ధం చెప్పాను. సారీ! అయితే ఈ పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందేమో అన్న ముందు జాగ్రత్తలో మనముంటే మంచిదే. అందుకే నువ్వు పిల్లల స్కూలు గురించీ, కారు గురించీ, ఇల్లు గురించీ చేసిన సూచనలు ఆలోచింపదగినవే అనిపిస్తోంది నాకు. ఎప్పుడూ అబద్ధం ఆడని నేను ఇంత పెద్ద అబద్ధం అదీ నీ దగ్గర చెప్పానంటే నేను ఎంతటి మానసిక సంఘర్షణకు లోనయ్యానో, బాధపడ్డానో అర్థం చేసుకో సామీ! నిజంగా ఇంకోసారి అబద్ధం ఆడను. కోప్పడకు ప్లీజ్..నువ్విలా నన్ను దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా మాట్లాడి ఎన్నాళ్ళైందో గుర్తుందా? డబ్బు, ఉద్యోగం, పిల్లలు, బంధువులు, స్నేహితులు ఇవేవీ కూడా మన మధ్యన దూరాన్ని పెంచడం నేను భరించలేను" రెండు నెలలుగా తను అనుభవిస్తున్న మానసిక వేదనను, క్షోభను మరచిపోవాలన్నట్టు కళ్ళు మూసుకుంది సరయు.

'అతను తనను దూరంగా నెట్టేసి నాతోనే ప్రాక్టికల్ జోక్స్ ప్లే చేస్తావా? ఉద్యోగం పోయినంత మాత్రాన అంత పనికిరాని వాడిగా కనబడుతున్నానా నీకు? అంటూ లేచి దూరంగా వెళ్ళిపోతే?' అన్న భయంతో ఆమె మనసు ఒక్క క్షణం వణికింది. ఆ భయాన్ని తొలగిస్తూ సౌమిత్రి చేయి మృదువుగా ఆమె చెంపనిమిరింది.

"నీ ఉద్యోగం భద్రంగా వున్నందుకు నాకెంత రిలీఫ్‌గా అనిపిస్తోందో నీ చేత ఇంత అబద్ధమాడించేంతగా నిన్ను బాధించానన్న విషయం నన్ను అంత సిగ్గుపడేట్టు చేస్తోంది సరయు. నువ్వన్నది నిజం పరిస్థితులుగానీ, మనుషులుగానీ మన ప్రేమకు గ్రహణం పట్టే అవకాశం ఇక ఎప్పటికీ ఇవ్వను. ప్రామిస్" అన్నాడు నమ్మకంగా.

కారు మబ్బులు కమ్ముకోగా తుపాను వచ్చి ముంచెత్తుతుందేమో నని భయపడితే మబ్బులు చెదరిపోయి చంద్రోదయమైనట్టు సరయు ముఖంలో వెన్నెల విరిసింది. ☆



## మరో ఛాన్స్

చిరంజీవి సరసన 'శంకర్‌దాదా జిందాబాద్' సినిమాలో నటించడం ద్వారా సినిమా హీరోయిన్ అయిన మోడల్ కరిష్మా కోటక్‌కి మరో అవకాశం వచ్చింది. 'గ్లామర్' అనే సినిమాలో నాయికగా నటిస్తోంది. తొలి చిత్రం తర్వాత ఇంతవరకూ అవకాశాల్లేని కరిష్మా తనకి మళ్లీ ఈ ఛాన్స్ రావడం ఎంతో ఆనందాన్నిస్తోందని అంటోంది. సినిమా రంగానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మాణమవుతున్న ఈ సినిమా అయినా ఆమె కెరీర్‌కి మంచి బ్రేక్‌నిస్తుందేమో!